కథ

గానుగెద్దు జీవితాలు

—సోదుంజయరామ్

మసక మసకగా వెలుగుతున్నలాంతరుముందు కూచుని వాసమూర్తి ఏదో చదువుకుంటున్నారు. పక్కమీదపడుకున్న అనూరాధకు నిద్ర రావడంలేదు. మాటిమాటికి అటూ, ఇటూ దొర్లుతోంది- లాంతరు ఆర్పనందుకూ, ఇంకావక్క చేరనందుకూ అనూరాధకు చిరాకుగావుంది. ఏ కాసింత వెలుతురున్నా. తనకు నిద్ర రాదు. వాసమూర్తి రాత్రిళ్లు గంటలతరబడి చదువుతూ కూర్చుంటాడు. అలా చదువుతూ కూర్చోవడంలోవున్న ఆనందం వాసమూర్తికే తెలియాలి ఇట్లా నిద్ర కాయడమంటే తనకు తలప్రాణం తోకకువస్తుంది ఇవాళ్ళ మనసు మరీ అదోరకంగావుంది కళ్ళుమూసి పడుకుంటే కాస్త ప్రశాంతంగా వుంటుంది; వాసమూర్తి ఇంకాఎంతసేపు కూర్చుంటాడో ఆ లాంతరుదగ్గర!

'చాలాపొద్దుపోయింది. లాంతరుఆర్పి పడుకోండి' అందామన్న ఆలోచన మనసులోకి వచ్చింది అనూరాధకు. కాని అనడానికి మనసులో ఏదో సంకోచము వాసమూర్తి ఏమన్నా అనుకుంటాడనికాదు. ఇవ్వాల భోజనాలముందు వాసమూర్తితో కొంచెం ఘర్షణ జరిగింది. నిజానికి దాన్ని ఘర్షణ అనడానికి కూడా వీలులేదు. ఇద్దరుమాటామాటాఅనుకుంటే అది ఘర్షణ వాసమూర్తి నోరెత్తనే లేదు కేవలం తనుమాత్రమే నోరుచేసుకుంది. చాలాగట్టిగా నోరుచేసుకుంది. వాసమూర్తి నోరెత్తలేదు. ఆశ్చర్యంగా తలెత్తి, తనవైపొకసారిచూచి తలదించుకున్నాడు. మనసులో ఎంతబాధపడ్డాడోఏమో. అయినా తనకీమధ్య మరీ నిగ్రహం లేకుండాపోతోంది. కాసింతకూ, కూసింతకూ కూడా చిరాకు కలుగుతోంది. నిజానికి ఇవ్వాళ వాసమూర్తిని అంతలేసిమాటలని బాధపెట్టాల్సిన కారణంగూడా లేదు. తను అన్నంవడ్డిస్తోంది. "ఏంకూర వండావు అనూ ఇవ్వాళ" అన్నాడు. అది ఆయన మామూలుధోరణి. ఇంట్లో బెడలులేక పప్పుచెయ్యలేదు. ఉల్లిగడ్డలసాంబారు చేసింది ఆ మాట సవ్యంగా జవాబుచెప్పవచ్చు; తనతో ఏ భూతం ఆవేసించిందో

ఆ క్షణాన, తారాజువ్వలా చ్రురునలేచింది తను.

అంతా అసంబద్ధ ప్రేలాపన ఆయన అసమర్థతకీ తన దౌర్భాగ్యానికిముడి పెట్టి నానా హంగామాచేసింది, ఆయన గమ్మునకూర్చొని, యాంత్రికంగా భోజనం ముగించాడు. తనకి అన్నంకూడా సహించలేదు. మనస్సంతా వికలమై పోయింది.

వాసమూర్తి ఏమీ జరగనట్టే, నిర్వికారంగా కూచొని చదువుకుంటున్నాడు, బహుశా అంతా మరిచిపోయి వుంటాడు ఆ సహనం ఎట్లా అలవర్చుకున్నాడో వాసమూర్తి !?

అనూరాధ రెస్ట్‌లెస్‌గా అటువైపు దొర్లింది. వాసమూర్తిని గూర్చి, ఆయన సహనాన్ని గూర్చి, ఆలోచించడానికి మనసొప్పలేదు. కిటికీలోంచి బయటకీ చూచింది. రాజగోపాలం గారింట్లో ప్రకాశవంతంగా బార్ లైట్లు వెలుగుతున్నాయి. లైట్లకాంతిలో ఇంద్రభవనంలా ఉన్న యిల్లు అనూరాధకు ఆ యింట్లో వున్న వస్తుసముదాయమంతా కళ్ళముందు మెదిలింది. రేడియో-ఖరీదయినసోఫాలు అద్దాల బీరువాలు- బీరువాలనుండా కళ్ళు జిగేలుమనే బట్టలు. పట్టె మంచాలు- పాన్పులు-ఒకటేమిటీ-అన్నీ వున్నాయి. రాజ్యలక్ష్మి అదృష్టవంతురాలు. ఆమె భర్త రెండు చేతులా సంపాదిస్తున్నాడు. వాసమూర్తిలా రాజగోపాలం ఆఫీసు గుమస్తాకాదు ఏదోవ్యాపారం, డబ్బుకు కొదవలేదు, బాగా అనుభవిస్తున్నాడు. పుణ్యం కొద్దీ పురుషుడన్నారు అది రాజ్యలక్ష్మి అదృష్టం.

రాజ్యలక్ష్మిగారు ఈ మధ్యేదిగారు ఆ యింట్లో, కొత్తగా యింట్లో దిగగానే ఆమె వచ్చి పలకరించింది. బెనారస్ సిల్కుచీర, మెడలో జిగేలమనేరవ్వల నెక్లెస్, ఠీవిగా, దర్పంగా, ఇంట్లో అడుగుపెట్టిన రాజ్యలక్ష్మిని చూచి తాను కుంచించుక పోయింది. ఆమెకు ఏం మాట్లాడాలో, ఎలా గౌరవించాలో, తెలియక తికమక పడ్డది. ఖర్మ! ఆవిడను కూర్చున బెట్టేందుకు ఇంట్లో ఒక కుర్చీ అయినా లేదు ఎలాగో మంచం వాల్చింది కానీ, ఆవిడ కూర్చోలేదు. ఉన్న కాసేపూ, అలాగె నిలబడి ఉంది. నిలబడే ప్రశ్న పరంపర కురిపించింది. మీవారేం చేస్తారు? జీతమెంత? ఇంటిదగ్గర ఆస్తిపాస్తలేమన్నా ఉన్నాయా? ఇంత తక్కువ జీతంలో ఎలా సంసారం దిద్దుతున్నావ్?

అన్నీ ఇట్లాంటి ప్రశ్నలే. అన్నీ తన లేమిడిని బట్టబయలుచేసే ప్రశ్నలు. జోనులోవున్న ముద్దాయిలా సమాధానం చెప్పవలసివచ్చింది. ప్రతీసమాధానం లోనూ, తన ఆత్మాభిమానం దెబ్బతింది. రాజ్యలక్ష్మి వెళ్ళేముందు 'అదేమాయిల్లు రేపోసారి రండి' అన్నది. అనూరాధ మౌనంగా తలూపు, తలువువరకు వెళ్ళి సాగ నంపింది.

రాజ్యలక్ష్మి వెళ్ళగానే పెద్ద నిట్టూర్పువిడిచింది. ఏంపనిచెయ్యడానికి తోచలేదు. నిశ్చలంగా కూర్చొని, తనలేమిడిని గూర్చి తలపోసుకోసాగింది ఎంత నికృష్టంగా బ్రతుకుతోంది తను. జీవితంలో, సంతృప్తి, శాంతి సుఖం—అన్నీ దూర మయ్యాయి. పెళ్ళిగాకముందు కన్న కలలన్నీ, కళ్ళముందే కరగిపోతున్నాయి. అవును ఆ రోజుల్లో- ఎంతమంచికలలు! ఆ కలలని ఇప్పుడు జ్ఞాపకంచేసుకోవాలన్నా భయమౌతుందీ. తనజీవితానికి మిగిలిందే భయం. తనకు ఎవర్నిచూసినా భయం. అంతా తన్ను న్యూనతపరుస్తారు. అవహేళనచేస్తారు. చుట్టూ, అంతా రాజ్యలక్ష్మి లాటి వారున్నారు. వారికి తనలాటి వారిని-అవమానిస్తేతప్ప, బాధిస్తేతప్ప తృప్తిలేదు.

మొన్న ఆ నాగరాజ్యం కూడా అలాగే మాట్లాడింది. ఆవిడ భర్త కం ట్రాక్టరు, కూలీల కడుపులుకొట్టి, పాపిష్టి డబ్బు కూడబెట్టాడు. ఆ డబ్బు చూచి నాగరాజ్యం అతిశయం, డబ్బులేనివాళ్ళు, ఆవిడ దృష్టిలో హీనాతి హీనం, వాళ్ళను అవమానించి, బాధపడుతుంటే చూడటం ఆవిడ ఆనందం! ఆవిడ నోరు కదిపితే బాణాల్లాటి మాటలు, ఎదుటి మనిషి గిలగిల తన్నుక చావాలి. బాణం దెబ్బకు పక్షి పడితే వేటకాడు చూచి ఆనందించినట్లు ఆనందిస్తుంది.

ఒక్కరైకు ఏం తోస్తుంది ఇంట్లో? రేడియో కొనలేకపోయాడామీఆయన? బోసిమెడన ఎలా వుంటున్నావమ్మా, వంటిపేట గొలుసన్నా చేయించుకోలేక పోయావ్?

ఇలాసాగింది ఆవిడ ధోరణి. నగలూ, రేడియోలు కొనగల స్తోమత తనభర్తకుందోలేదో నాగరాజ్యానికి తెలుసు. తెలిసీ, తన దౌర్భాగ్య స్థితిని ఎత్తి చూపడం ఆవిడ లక్ష్యం.

ఇట్లాంటి సంఘటనలు జరిగితే తనకు పుండుమీద కారం జల్లినట్లుంది, అనుకోకుండానే వాసమూర్తిమీద ఏవగింపు కలుగుతుంది. నాగరాజ్యం భర్తలాగ

349

వాసమూర్తి కంట్రాక్టరు అయి వుంటే బాగుండు. రాజ్యలక్ష్మి భర్తకులాగ వ్యాపారంవున్నా బాగుండు. కానీ వాసమూర్తి కేవలం గుమస్తా గుమస్తా అయినందుకు వాసమూర్తిమీద గొంతుదాక వస్తుంది. ఆ కోపాన్ని, అంతరంతరాల్లో అణగార్చడం చేతకాదు, అందుకే అడపా, దడపా చిరాకు, కోపం, అసహ్యం, అన్నీ వాసమూర్తి మీద కుమ్మరిస్తుంది

అనూరాధ కళ్ళు తెరచి వాసమూర్తివైపు చూచింది. చదవడం చాలించి, గోడకి చేరగిలబడి సిగరెట్టుపీలుస్తున్నాడు భోజనాల దగ్గర తను చేసిన ధూం, ధాం ను గురించి ఆలోచిస్తున్నాడేమో! నిజంగా వాసమూర్తే తన స్థితికి? వాసమూర్తి దోషమేముంది ఇందులో? అంతా తన రాత! పూర్వజన్మ సుకృతం మనసు వికలమై-నిష్కారణంగా వాసమూర్తిమీద పడుతుంది తను- అనురాధ భారంగా నిట్టూర్చి కళ్ళుమూసుకుంది. కాసేపట్లో నిద్రలోకిజారింది.

వాసమూర్తి గోడకి చేరగిలబడి కళ్ళు మూసుకున్నాడు. మనసులో తెరపిలేని ఆలోచనలు ఇందాకా పుస్తకం చదువుతూ కూచున్నాడు. కానీ-ఒక్కముక్కా బుర్రకెక్కలేదు. వూరికే పేజీలు తిప్పుతున్నాడు. మాటిమాటికీ అనురాధ కళ్ళముందు మెదలుతోంది అవును అనురాధ తనకి ఒక సమస్య అయిపోయింది తల బద్దలుకొట్టుకున్నా తెగని సమస్య.

ఇవ్వాళ తను నిజంగా స్తంభీ భూతుడయ్యాడు అంతరాంతరాల్లో పశుత్వం విజృంభించింది. కుతికెదాకా వచ్చింది. మళ్ళీ తమాయించుకున్నాడు. అనురాధ ఏదో అవివేకంగా ప్రవర్తిస్తే, సభ్యతా సంస్కారమున్న తనూ అలా ప్రవర్తించడమేమిటి. తను ఓరిమి వహించడం మంచిది. ఈ ఆలోచనతోనే తను అవాక్కయిపోయేడు.

కాని ఇవాల్టి సంఘటన మొదటిదికాదు, ఇకమీదట అనూరాధ ఇట్లా ప్రవర్తించదు అన్న నమ్మకం లేదు, ఈ అశాంతి-అలజడి - ఎన్నాళ్ళని భరించగలడు? జీవితం పట్లా. తనపట్లా, అసంతృప్తి తప్ప అనూరాధకి మరొకటిలేదు. ప్రతిక్షణం సాఫుగా అనూరాధ ఆ విషయం వ్యక్తపరుస్తోనే వుంది.

తను అసమర్థుడు. తనమూలాన అనూరాధకి అన్నీ కష్టాలే. బ్రతుకులో సుఖంలేదు శాంతిలేదు ప్రపంచంలో అంతా సుఖపడి పోతున్నారు. ఒక్క అనూరాధ తప్ప! దానికి కారణం తను!!

వాసమూర్తి సిగిరెట్టు వెలిగించాడు. కళ్ళుచెమ్మగిల్లాయి. ఇట్లాంటి అనూరాధతో- తను జీవితం నడపాలి.తను ఆశించింది ఈ జీవితంలో ఈషణ్మాత్రమూ లభ్యంకాదు. తనకు లభ్యమయ్యేది కేవలం శారీరక సౌఖ్యం. ఆ సౌఖ్యాన్ని డబ్బుతీసుకొని పంచేవాళ్ళు చాలామంది వున్నారు.

కాని తను ఆశించిందివేరు. హార్ధికమూ, అనురాగమిళితమూ, అయిన దాంపత్యసౌఖ్యంకావాలి. అదేలోపించింది తన జీవితంలో. దానికోసం అనూరాధకు తను ప్రతిఫలం చెల్లించాలి. కానీ తనకు అదిసాధ్యం కాదు.

ఏముంది తనచేతుల్లో? వందయాభై రూపాయలకు అమ్ముడు పోయిన బానిస తను. బంగళాలూ, కార్లూ, ఏమీలేవు. ఇకముందు వుంటాయన్న భరోసా లేదు. గొర్రెతోక జీవితం. దీనిలో ఎదుగూ, బొదుగూ ఆశించడానికే ఆస్కారం లేదు. అవును అనూరాధలో కూడా మార్పు వుండదు. ఆవిడకు ఎప్పుడూ అసంతృప్తిగావుంటుంది. అనూరాధ కోరుకున్నవి ఈ జీవితంలో ఏమీ దొరకవు.

వాసమూర్తి గొంతుకలో ఏదో ఉండలా అడ్డుపడ్డది. జీవితమే నిస్సారంగా కన్పిస్తోంది. అనూరాధకు కావలసింది తనుకాదు, తనిచ్చే సౌఖ్యాలు కావాలి. ఆసౌఖ్యాలు లభ్యంకాక తనపట్ల అసంతృప్తి.

అనూరాధ-తన్నుకాక—మరొకని పెండ్లాడ వలసింది. ఆవిడకు జీవితం నూడు పువ్వులు ఆరుకాయలుగా వుండేది. ఆవిడ దురదృష్టం అలా జరగలేదు. 'మ్యారేజేస్ ఆర్ మేడిన్ హెవెన్' నిజమేకాబోలు,

వాసమూర్తి దృష్టిలో గతం మెదిలింది. ఏ పరిస్థితిల్లో అనూరాధకూ, తనకూ ముడిపడ్డదో వాసమూర్తికి తెలుసు. అనూరాధ తండ్రి అనూరాధ కోసం ఖరీదైన వరుణ్ణి, కారు చౌకలో తేవాలని- ఎంతగానో ప్రయత్నించాడు. ఆడపిల్లలి తండ్రులకున్న ఆశే ఆయనకూ వుండేది. డాక్టరునో. ఇంజనీరునో_ అనూరాధ కోసం సంపాదించాలని ప్రయత్నం. చేతిలోవున్నది పదివేలు. ఆయనకున్న ఆశకూ ఎక్కడా లంకె కుదరలేదు. పదేళ్ళ ప్రయత్నం తర్వాత "దీనికా రాతలేదు. అందుకే కలిసిరాలేదు" అని అంతా అనూరాధ రాతమీదత్రోసి- తన సంబంధం పెట్టుకున్నాడు.

తనకూ-అనూరాధకూ రాసిపెట్టివున్నదేమో. తనంటే ఇష్టం లేని

అనూరాధ—తనపాలిట పడ్డది. తన జీవితాన్ని నరక తుల్యం చెయ్యడానికి సిద్ధపడుతోంది!

అనూరాధకి తనంటే ఇష్టంలేదు. తనంటే ఇష్టంలేని అనూరాధ-తనకిష్టం లేదు. చిత్రం! ఇష్టాల ప్రసక్తిలేకుండానే- తమ దాంపత్యం సాగిపోతుంది అవును అది ఇలా సాగిపోతూనే వుంటుంది. తనంటే ఎంతయిష్టము లేకపోయినా— అనూరాధ తన్నువిడిచి పోలేదు. ఎక్కడికి పోతుంది? పొట్ట పోషించుకునేందుకు- చదువూ—ఆస్తీ - ఏమీలేవు. ఏమీలేకుండా ఏం చేస్తుంది? తనే మగవాడయి వుండీ- సంకటావస్థలో పడుతున్నాడు. ఒకటి రెండుసార్లు- దీనికి ఏదోపరిష్కారం ఆలోచించాలనుకున్నాడు. ఏమిటి పరిష్కారం?

అనూరాధతో స్పష్టంగా చెప్పాలి, "మనలో- ఇష్టంలేని దాంపత్యం వ్యభిచారంకన్నా ఘోరం. విడిపోవడం-నీకూ, నాకూ ఇద్దరికీ శ్రేయస్కరం"

ఈ మాట తననోటంట అనూరాధ వింటే- ఇల్లెగిరి పోయేట్లు ఏడుస్తుంది కాబోలు. ఏడుస్తూనే 'మీరంటే నాకు ఇష్టంలేదని ఎవరన్నారు? అంతా వట్టి అబద్ధం అన్నీ మీరే కల్పించుకుంటున్నారు." సందేహంలేదు. ఈ మాటలే వస్తాయి అనూరాధ నోటంట. బ్రతుక్కి గ్యారంటీలేని ఏ ఆడదయినా ఆ మాటే అంటుంది ఏం చెప్పగలడు తను? అనూరాధతో అవసరం లేకుండా ఏకపక్ష నిర్ణయంచేస్తే సంఘం ఇచ్చేతీర్పుకు తను తట్టుకోగలడా? అనూరాధని, సీత, సావిత్రిలాంటి పతివ్రతల కోవలోకి చేర్చి- తన్ను కేవలం- ఒక రాక్షసుడి కింద జమకడుతుంది సంఘం. అగ్గిలాంటి ఇల్లాలిని అన్యాయంగ వదిలివేశాడంటుంది. తను ఏం జవాబు చెప్పగలడు? ఋజువేమిటి? హృదయంలో వున్న గాయాల్ని ఎలా చూపగలడు?

లేదు. దీనికి పరిష్కారమార్గంలేదు ఇష్టమున్నాలేకపోయినా కాపురం సాగించి తీరవలసిందే అనూరాధ-తను ఇద్దరూ వలలో చిక్కుకున్న చేపలు. ఎంత గింజుకున్నా వలవదలి పోలేరు. బలమైన వల ఛేదించ శక్యంకానివల! జీవితాంతం-విలవిలా గింజుకు చావాలి!

ఆలోచనలతో వాసమూర్తి తల వేడెక్కింది. లేచి నిల్చున్నాడు. అనూరాధ పడుకుని నిద్రపోతోంది. పైట పక్కకి తొలగింది. ఎత్తయిన రొమ్ములు, ఉచ్ఛ్వాస. నిశ్వాసాలకు కిందికీ పైకీ లేస్తున్నాయి. వాసమూర్తి లాంతరుఆర్పి, మంచం దగ్గరికి వెళ్ళాడు. పడుకోవడానికి అనూరాధని కొంచెం

పక్కకి వత్తిగించాడు. స్పర్శకు అనూరాధకు మెలుకువ వచ్చింది. ఇటువైపు తిరిగి మత్తుగా, వాసమూర్తి మీద చెయ్యివేసింది. కిటికీలోంచి ఈదురుగాలి వీస్తోంది. వాసమూర్తి అనూరాధని దగ్గరికి తీసుకున్నాడు. వెచ్చటి స్పర్శ! కాసేపు ఆ హృదయాలలోని అశాంతి, అలజడి– అన్నీ మాయమయ్యాయి.

చర్చావేదిక:

జీవితానుభవంలో హేతువాద దృష్టి

"మానవుడు పరిసరాలను మార్చుకొనటంలోనే తనూ మారతాడు. వాటినిమారుస్తాడు అభ్యుదయశీల దృక్పథం యిదికాదా?"

జీవితానుభవంలో హేతువాదదృష్టి అనే శీర్షికతో సురమౌళిగారు ఆరంభించినచర్చలో పాల్గొంటూ యస్ గోవిందరెడ్డిగారు చివరకువేసిన ప్రశ్నయిది యీ ప్రశ్నచెబుతున్న సమాధానంలో యిమిడివున్న సూత్రీకరణ. సిద్ధాంతీకరణ పాక్షికసత్యమే. సురమౌళిగారు సమాజాన్నించి తనని విడదీసుక చూస్తున్నారనేది బలంగా చక్కగాచెప్పగలిగిన గోవిందరెడ్డిగారు మార్క్సుని పట్టకొని వ్యక్తిని సమాజంతో కలిపేసి, మానవుల మానవ సంబంధాల ప్రతిబింబమే సమాజం అనే సత్యాన్నిచూడటం పోగొట్టుకొని సమాజాన్ని వ్యక్తికి సంబంధంలేని *abstract thing* గా జేసి (ఆస్తికులు దేవునిలాగా) అందువల్ల, పోరాడాలంటూకూడా వ్యక్తి యొక్క కృషికి అస్కారంలేకుండా వ్యక్తిని నిర్వీర్యుని చేయటమవుతున్నది

అసలు చర్చాశీర్షికకూ గోవిందరెడ్డిగారు ముగింపుద్వారా తీసుకొచ్చిన వారి మొత్తం వ్యాసపు సారాంశానికి భేదంవుంది. ఏది అభ్యుదయశీల దృక్పథం అనికాదు యీ చర్చ.

హేతువాదం అంటే ఏమిటి? జీవితానుభవంలో హేతువాదదృష్టి ఎలా ప్రతిఫలించుతుంది అనేది చర్చగా భావిస్తున్నాను నాస్తికత్వమే హేతువాదమని చెబుతున్నారు సురమౌళిగారు. తను నాస్తికుడుగనుక హేతువాదినని నిరూపించు

353